# నేనేం చేశా?

' రాజా '

సంవత్సరానికొకటి చొప్పున, కలకత్తా హార్బరు నాకు వేసిన అయిదు ముళ్ళను వదిలించుకొని 'విశాఖ' చేరే—అయిదువేలతో.

'అయిదువేల' విషయం నా రాకకంటె ముందుగనే 'విశాఖ'కు వ్యాపించడంవల్లనే కాబోలు, ఎక్కడెక్కడి బంధుమిత్రులు వచ్చి నన్ను చుట్టేసి నా కుశలాన్ని విచారించ సాగేరు—అనుకున్నా.

అన్నయ్య రహస్యంగా నన్నో పక్కకు పిల్చి జాలిగా అడిగేడు ఆ రాత్రే: "ఇన్నాళ్లూ కలకత్తాలో పెద్దపెద్దవాళ్ళతో తిరిగేవు. అదెట్లా వుంటుందో మాక్కూడా కాస్త చూపించరాదూ?"

ఆశ్చర్యంతో మాటాడలేకపోయే. అన్నకు కావలసినదేమిటి? అంత సిగ్గెందుకు?

అడిగే 'ఏమిటో చెప్పమని.'

'అదే' అన్నాడు మళ్ళీ.

"చంపక—చెప్పుదూ, అదేమిటో!" అన్నా.

శూన్యంలోకి చూస్తూ అన్న అన్నాడు: "ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్నా—అది ఎట్లావుంటుందో చూద్దామని. కాని యీ సంఘానికి—మిత్రులకి, తెలిస్తే, పరువు ఏమయినా వుంటుందీ! ఎవ్వరూ చూడకుండా ఆ స్పెన్సరులో అయినా దూరదామంటే. మా ఆఫీసరు ఎప్పుడూ, అందులోనే వుంటాడాయిరి. నువ్వు యిన్నాళ్ళు అక్కడ వుంటూ అలవాటు పడకుండా వుండవ్....అందుకని....పోయి.... ఓ 'బాటిలు'.......పట్రా ....చూద్దాం!"

అంతా అర్థమయ్యింది. కాగా విస్తుపోయే! ఎన్నడూ ఆటువంటి ద్రవాలను ముట్టని నన్ను గురించి యీ ఖ్యాతెట్లా అలుముకుంది!

"అబ్బే! మొహమాటపడకు. కావలిస్తే.... నే డబ్బిస్తా. "వెళ్ళి పట్రా."

"కాదన్నయ్యా! అసలు ఆ రుచెట్లా వుంటుందో కూడా—"

"నాకు తెల్సులే. మాట్లాడక వెళ్ళిరా! ఆ కోటు జేబులో డబ్బుంది."

ఏమిచేసేది? లేచి డబ్బులుతీసుకున్నా.

'ఏరకం కావాలి?'

'ఏది బావుంటుంది?'

'ఏమో, నాకేం తెల్సు.'

"చాల్లేయిక, ఏది బాగుంటుందో అదే పట్రా."

ఎట్లా నమ్మించేది అన్నను—నేను వాటి సంగతెరగనని? మాటాడక F. L. 2 వైపు నడిచే ....తొట్రుపడే పాదాల్తో.

చంకలోని St. Bernard సీసా కార్కులా వూగుతూన్న హృదయంతో యింటికి వచ్చే.

ఆదరంతో అన్న నన్ను కౌగలించుకొని గదిలోకి తీసుకొని వెళ్లి తలుపు గడేసేడు ఆనందంతో పిచ్చగంతులు వేసి....మూత విప్పేడు. రెండు గ్లాసులలో ద్రవాన్ని నింపేడు వణికే చేతుల్తో.

ఏమిటే, నేనూ తాగాలా? లేచి నిలబడ్డా, అన్నయ్య నవ్వుతూ నన్ను కూర్చోపెట్టి.... 'ఫర్వాలే! నా ఎదట సిగ్గెందుకు?' అన్నాడు.

'అదికాదు అన్నయ్యా—'

'ఛ. ఛ! కానీయి, ఘాటంతా పోతూంది.' గ్లాసును ముందుకు జరిపేడు అన్న. కళ్ళు మూసుకుని ద్రవాన్ని గొంతులో వొంచేసే. గొంతంతా మండిపోయింది.

మళ్లీ నింపేడు అన్నాయి. 'వొద్దు-యిక,' అన్నాను.

"ఏడిసేవు. యీ మాత్రానికే—" నవ్వేడు అన్నాయి.

'కాదు, నిజంగానే—'

"తాగవోయి, ఫర్వాలే, ఊ. కానీయి అల్లరి చేయక."

తల వొగ్గే—తల తిరిగిపోయేవరకు.

మరునాటి సాయంత్రమే సుబ్బులు-అన్నయ్య ఆప్తమిత్రుడు అడిగేడు: 'మాకేది?' అంటూ.

"ఏమిటది?" అన్నా హీనస్వరంతో.

అప్పుడే ఇతని కెట్లా తెల్సిందీ? ఎట్లా యీ ఆపద తప్పించుకోడం? అనే ప్రశ్నలు నాట్యం చేస్తున్నాయి....వికృతంగా.

"అదే, నిన్నటిది."

"నేనిచ్చే దేముంది. బజారుకెళ్తే సరి." అన్నా కటువుగా.

"అది నువు చెప్పాలా? బజారువెళ్ళే ధైర్యం లేకేగా....నిన్ను పట్టుకు దేవులాడేది."

"ఏమో, నాకేం తెలియదు."

"ఇంతేనయ్యా స్నేహితులంటే. కాస్త మొహమాటమన్నా వుంచరు."

తిరిగి F. L. 2 వైపు నడిచే, White Horse తో వెనక్కివచ్చే. సగంవాటా పుచ్చుకొనందే సుబ్బులు వదలనని మంకుతనం చేస్తే, ఏం చేసేది? మిత్రుడి మాటను కొట్టేయ లేకపోయే. అతని కోరికలకు తల వొగ్గే.

తల తిరిగి—భయంతో అక్కడే పడుకున్నా రాత్రికి.

పొద్దున్న శర్మ అగుపించేడు. పాండు అగుపించేడు. విశ్వనాథం అగుపించేడు—వకరి తర్వాత వకరు.

అంతా, అంతా, అంతా.... అదేమాట! అదే కోరిక! అదే బలవంతం!

ఏంచేసేది? ఆఖరికి మా యింటిప్రక్క పురోహితుడు సత్యనారాయణశాస్త్రికూడా అదేమాట.

ఏం చెప్పేది? అందరికీ అభయమిచ్చే, అందరికీ తేదీలు నిర్ణయించే, అందరినీ సంతోషపరిచే ....వరుసగా.

కాని మిత్రులంతా నన్ను వదిలేసినా, నా వుపకారాన్ని మరచిపోయినా, ఆ నాటినుంచీ నేను ఆ ద్రవాన్ని వదలలేకపోతున్నా. అన్నయ్యకంటె, యితర మిత్రులకంటె అధికధైర్యం గల నేనా "షాపు"కు వెళ్ళగల్గుతున్నా.

ఈనాడు—

ఉద్యోగం సరిగా చేయడంలేదని "శాస్త్రి" నిందిస్తున్నాడు.

సంసారం యిక నడవదని అన్నయ్య చెబుతున్నాడు.

"నీతో వుంటే మా పరువు పోతుందని" సుబ్బులు అంటున్నాడు.

"ఇక నిన్ను వెలి వేస్తామని" ఇంటిప్రక్క పురోహితులు చెబుతున్నారు.

నేను ఏంచేసే? ఎందుకు నామీద అందరికీ యింతకోపం! అక్కడికీ అందర్నీ చూసి చిర్నవ్వు నవ్వుతూనేవుంటా. "అందరి ఆరోగ్యంకోసం" అని అంటూనే వుంటా.

అయినా అంతా నన్ను చూసి పళ్లు కొరుకుతారు. అంతా తళతళ మెరిసే కత్తులు నూరుతారు.

నేనేం పాపం చేసేనని చెప్పండి!


కుష్ఠు ★ బొల్లి

అన్నిరకముల కుష్ఠులకు, బొల్లి వ్యాధులకు, ఇతర చర్మవ్యాధులకు గ్యారంటీగా పనిచేయుచున్నవి.

మా ఔషధ రాజములే!!

(క్రొత్తగా అచ్చువేయబడిన మా తెలుగు పెద్ద కేటలాగులు, 10 భాషలలో ముద్రించియున్న కేటలాగులు, యోగ్యతాపత్రములు ఉచితము!

రెడ్డి & కో., (రిజిస్టర్డు) ★ H. O. గోపాలపురం (వయా) తణుకు, తూ. (గోదావరిజిల్లా)

బ్రాంచ్ ఆఫీసులు:

బెజవాడ గాంధినగరం ★ వాల్తేరు R. S. ★ కటక్ బక్సిబజార్ ★ సికిందరాబాదు 8560 కింగ్సువే

నెల్లూరు కాపువీథి ★ ఫజిల్‌నగర్ గోరక్‌పూర్